క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నెక్కొండ, నల్లబెల్లి, దుగ్గొండి, గీసుకొండ, సంగెం మండలాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. పలు ఆలయాల్లో అర్చకులు సామూహిక వరలక్ష్మి వ్రతాలు చేయించారు. మహాలక్ష్మి అమ్మవారికి ఉత్సవ విగ్రహాలకు శ్రీసూక్త విధానంలో పంచామృత అభిషేకాలు చేశారు. మహిళలు వాయినాలు ఇచ్చుకుని సందడి చేశారు. ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి.

ముందస్తు రక్షాబంధన్



నల్లబెల్లి/నెక్కొండ/సంగెం: నల్లబెల్లి, నెక్కొండ, సంగెం మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో శుక్రవారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థినులతో విద్యార్థులకు రాఖీ కట్టించి పండుగ ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా నల్లబెల్లిలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) మండల శాఖ ప్రముఖ్ మార్త మార్కండేయ, నెక్కొండలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్ డైరెక్టర్ చల్లా మమత మాట్లాడారు. రాఖీ పండుగను సోదర భావానికి ప్రతీకగా అభివర్ణించారు.

తీజ్ పండుగ



నెక్కొండ : మండలంలోని గొట్లకొండ పరిధిలో గిరిజనులు శుక్రవారం తీజ్ పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న హాజరై గోధుమ బుట్టతో గిరిజనుల ఊరేగింపులో పాల్గొని సంప్రదాయం ప్రకారం చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడారు. గిరిజనలు సాంప్రదాయాలకు తీజ్ ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు. పెళ్లి కాని యువతులు సీత్లా పండుగ నుంచి తొమ్మిది రోజులపాటు ఉపవాస దీక్షలో ఉండి వెదురు బుట్టలో గోధుమలు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, నాయకులు కొమ్ము రమేశ్ యాదవ్, గుంటుక సోమయ్య, దొనికెన సారంగపాణి, బక్కి కుమారస్వామి, రమేశ్, దేవేందర్, చెరుకు లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఈర్యతండాకు చెందిన భూక్య బావుసింగ్ ఇటీవల మృతి చెందగా ఆయన కుమారుడైన బీఆర్‌ఎస్ కార్యకర్త రాజును, బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందించారు. అలాగే చెన్నారావుపేటకు చెందిన పిట్టల ఉప్పలయ్య, ఈర్యతండాలో ఆంగోతు బీక్యా ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను సుదర్శన్‌రెడ్డి కలిసి ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న, అధికార ప్రతినిధి కంది కృష్ణ చైతన్య, ఉపాధ్యక్షుడు కుసుమ నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు అనుముల కుమారస్వామి, కొండవీటి ప్రదీప్‌కుమార్, అమ్మ రాజేశ్, కార్యదర్శి సాదు నర్సింగరావు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మురళినాయక్, గ్రామ కమిటీ అధ్యక్షులు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రాగంపేటలో..

ఖానాపురం : మండలంలోని రాగంపేటకు చెందిన ఉప్పమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. తొలుత ఉప్పలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ ఐలయ్య, రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ అధికారికి..

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలికి చెందిన హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ మార్త రమేశ్‌ను అతడి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన క్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. తొలుత రమేశ్ తండ్రి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ధర్మారావు, మాజీ సర్పంచ్‌లు బోడకుంట్ల ప్రకాశ్, పూండ్రు జయపాల్‌రెడ్డి, అంకతి నాగేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు రఘుపతిరెడ్డి, విజయ్, కైలాస్, భాస్కర్, మంద రమేశ్, అభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానా ఏర్పాటు ఎన్నడో..?

- నిధులు మంజూరై మూడేళ్లు..
- స్థలం, భవనం కేటాయింపులో నిర్లక్ష్యం

నర్సంపేట రూరల్ : నర్సంపేటలో బస్తీ దవాఖానా ఏర్పాటు ఎన్నడో..? అంటూ పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన ప్రొటోకాల్ మేరకు 2022 సెప్టెంబర్‌లో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు బస్తీ దవాఖానాలు మంజూరు చేస్తూ రూ.13.20 లక్షలు చొప్పున కేటాయించిన విషయం తెలిసిందే. కాగా ప్రభుత్వం కేటాయించిన స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్, డాటా ఎంట్రీ ఆపరేటర్ ఇతర ఆస్పత్రుల్లో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు.

నర్సంపేట జనాభా సుమారు 60–70 వేలుగా ప్రభుత్వ రికార్డుల్లో నమోదు కాగా పట్టణ పేదలకు మెరుగైనా వైద్యసేవలు అందించే లక్ష్యంతో రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బస్తీ దావాఖానా మంజూరైంది. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు స్థల సేకరణ, భవన కేటాయింపు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని పలు స్థలాలను ఎంపిక చేయడం.. రద్దు చేయడం పరిపాటిగా మారింది. స్థలాన్ని, భవనాన్ని కేటాయించకపోవడంతో మూడేళ్లు గడచినా బస్తీ దవాఖానా ఏర్పాటుకు అడుగులు పడడం లేదు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు వెనక్కి వెళ్తాయన్న ఆలోచన సైతం అధికారులకు, ప్రజాప్రతినిధులకు లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



స్థలాలు ఎంపిక చేసినా..!

బస్తీ దవాఖానా ఏర్పాటు కోసం మున్సిపాలిటీ పరిధిలోని పలు స్థలాలు, భవనాలు ఎంపిక చేయడం.. క్యాన్సిల్ చేయడం పరిపాటిగా మారిందంటూ ప్రజలు బహిరంగంగానే మండిపడుతున్నారు. తొలుత పట్టణ పరిధిలోని సర్వాపురం శివారులోని గ్రామ పంచాయతీ భవనాన్ని ఎంపిక చేసినట్టు ప్రచారం జరిగింది. అనంతరం కొంత కాలానికి వల్లభ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయనున్నారని, శంకుస్థాపన కోసం ఏర్పాట్లు చేస్తున్నారన్న ప్రచారం జోరందుకుంది. తదనంతరం కొంత కాలానికి వైరాలజీ ల్యాబ్ భవనాన్ని కేటాయిస్తారని.. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆ భవనంలో రూ.150 కోట్ల విలువైన వైద్య పరికరాలుండడంతో ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొందని ప్రచారం జరిగింది. ఇలా పలు స్థలాలు, భవనాలు కేటాయిస్తున్నట్టు.. క్యాన్సిల్ అవుతున్నట్టు ప్రచారం జరిగినా గడచిన మూడేళ్లలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ప్రజలకు క్లారిటీ ఇచ్చిన దాఖలాల్లేవు.

స్థల కేటాయింపులో జాప్యం



నర్సంపేటలో బస్తీ దవాఖానాకు స్థలం కేటాయించడంలో జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు స్థలాన్ని లేదా భవనాన్ని మున్సిపల్ అధికారులు కేటాయించలేదు. దీంతో బస్తీ దవాఖానా ఏర్పాటుకు నోచుకోలేదు. మున్సిపల్ అధికారులతో పలుమార్లు సమావేశమై చర్చించాము. స్థలం లేదా భవనం కేటాయిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆస్పత్రికి ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ ప్రకాశ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

సిబ్బంది నియామకం.. డిప్యుటేషన్

పట్టణంలో బస్తీ దవాఖానా ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ శాఖ ద్వారా సర్క్యులర్ జారీ చేసి నిధులు మంజూరు చేసిన క్రమంలోనే వైద్యశాఖ ఫార్మసిస్టును, స్టాఫ్ నర్సును, డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించింది. మున్సిపల్ అధికారులు స్థలం, భవనం కేటాయించకపోవడంతో ఆస్పత్రి ఏర్పాటు కాని నేపథ్యంలో ఉన్నతాధికారులు ఫార్మసిస్టును చెన్నారావుపేట పీహెచ్‌సీకి, స్టాఫ్ నర్సును దుగ్గొండి పీహెచ్‌సీకి, డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను నర్సంపేట జిల్లా ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై పంపించారు.

ఆర్టీసీ సేవలు మరింత విస్తృతం



బస్ సర్వీసును ప్రారంభిస్తున్న చైర్మన్ శ్రీనివాస్, డీఎం, తదితరులు

- మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్

నర్సంపేట : ఆర్టీసీ సేవలను మరింత విస్తృతం చేస్తోందని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో నర్సంపేట నుంచి ముద్దునూరు మీదుగా వరంగల్‌కు ఏర్పాటు చేసిన నూతన బస్ సర్వీస్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముద్దునూరు మీదుగా వరంగల్‌కు బస్ సర్వీస్ గత ప్రభుత్వ హయాంలో 2021లో నిలిచిపోగా ప్రజలు రవాణా సౌకర్యం కోసం ఇబ్బంది పడుతుండగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ తీసుకుని సమస్య పరిష్కరించారని చెప్పారు. డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి మాట్లాడుతూ ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చుక్క రమేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు వేముల ఇంద్రదేవ్, మాజీ ఎంపీటీసీ బొల్లపెల్లి రాము, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ పాలాయి రవి, మండల అధ్యక్షుడు కత్తి కిరణ్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి బైరి మురళి, నాయకులు పులుగుల మాధవరెడ్డి, పెద్దపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు



వాహనదారులు, స్థానికులతో మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

- సీఐ రాజగోపాల్

పర్వతగిరి : మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని సీఐ రాజగోపాల్ కోరారు. మండలంలోని అన్నారంలో ఎస్సై బోగం ప్రవీణ్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. పలువురు వాహనదారులను బ్రీతింగ్ అనలైజర్‌తో పరీక్షించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు ఛిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. బాధిత కుటుంబాల వేదన తీర్చలేనిదని స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, వాహనచోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణలో వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

అటవీ జంతువులతో జాగ్రత్త



నల్లబెల్లి : అటవీ జంతువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు (ఎఫ్‌బీఓ) కిరణ్, సతీశ్, శోభన్ రైతులకు సూచించారు. మండలంలోని కొండాపురం శివారులోని గణేశ్‌నగర్‌లో రైతు కోటికి చెందిన ఎద్దుపై గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేసిందన్న ప్రచారం జోరందుకున్న సందర్భంగా అటవీ శాఖ సిబ్బందితో కలిసి వారు గ్రామాన్ని సందర్శించి బాధిత రైతుతో మాట్లాడారు. అడవి జంతువుకు సంబంధించిన పాదముద్రలు, ఇతర ఆనవాళ్ల కోసం విచారణ చేశారు. ఎద్దుపై దాడి చేసింది హైనా కావొచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. అడవి జంతువుల సంచారాన్ని గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతో జీవితంలో ఉన్నతి

- యూనియన్ బ్యాంకు ఆర్‌డీఓ గోవింద్

సంగెం : ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండడం ద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని యూనియన్ బ్యాంకు ఆర్‌డీఓ గోవింద్ తెలిపారు. మండలంలోని గవిచర్ల పంచాయతీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ సంపాదించిన డబ్బులో కొంత పొదుపు చేసుకోవడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. డబ్బును ఎట్టి పరిస్థితిలోనూ వృథా చేయకుండా సరైన రీతిలో వినియోగించడాన్ని ఆర్థిక అక్షరాస్యతగా అభివర్ణించారు. గ్రామాల్లో బ్యాంకు మిత్రలు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం సంగెం, గీసుకొండ మండలాల యూనియన్ బ్యాంక్ మోటివేటర్ మౌనిక మాట్లాడారు. బ్యాంకు ద్వారా అటల్ పెన్షన్ యోజన, తదితర పథకాలతో ఖాతాదారులకు బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు జీరో ఖాతా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శరత్ కుమార్, బ్యాంకు మిత్ర కర్నె భవిత, వీఓఏలు నారాయణమ్మ, అంబిక, రాధిక, మహిళా సంఘాల లీడర్లు రాధిక, వర్ష, కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్ మహబూబ్ పాషా, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మోటివేటర్ మౌనిక

నిర్మాణంలో నిబంధనలు తప్పనిసరి

- ఎంపీడీఓ అరుంధతి

దుగ్గొండి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని లబ్ధిదారులను ఎంపీడీఓ అరుంధతి కోరారు. మండలంలోని నాచినపల్లి, పొనకల్, లక్ష్మిపురం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆమె సందర్శించి పరిశీలించారు. గ్రామాల వారీగా మంజూరైన ఇళ్ల సంఖ్య, అందులో నిర్మాణం ప్రారంభం అయినవి.. ఇంకా మొదలు కానివి.. తదితర వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సూచనలు చేశారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. దశలవారీగా బిల్లులు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ముక్కెర ఆనంద్, కవిత, కొండల్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు నూటెంకి జయ, బుగ్గ అయిలయ్య, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎంపీడీఓ అరుంధతి

గ్రోమోర్ సెంటర్‌లో తనిఖీ



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని గ్రోమోర్ సెంటర్‌ను నర్సంపేట ఏడీఏ దామోదర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్, సేల్స్ రిజిస్టర్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. సెంటర్‌కు వచ్చిన ఎరువుల బస్తాలు ఎన్ని?, అందులో ఎన్ని అమ్ముడు పోయాయి? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన నిర్వాహకులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. రైతులకు నిబంధనల మేరకు ఎలాంటి షరతులూ విధించకుండానే అడిగిన మేరకు వారికి అవసరమైన ఎరువులు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. అడగనివి సైతం కొనుగోలు చేయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

- ప్రత్యేక అధికారి బాలకృష్ణ

నర్సంపేట : విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ కోరారు. చెన్నారావుపేట కేజీబీవీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యాలయంలోని వంట గది, స్టాఫ్ రూమ్, డైనింగ్ హాల్‌తోపాటు భవన పరిసరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, సమయపాలన పాటించాలని ఉపాధ్యాయులకు చెప్పారు. కార్యక్రమంలో విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ మెట్టుపల్లి జ్యోతి, ఉపాధ్యాయులు స్వప్న, కమల, తదితరులు పాల్గొన్నారు.



స్టాక్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు



ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ చేయిస్తున్న రవీందర్‌రెడ్డి, నాయకులు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

రాయపర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని గట్టికల్‌లో కారుపోతుల పిచ్చమ్మ, సుధాకర్‌లకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం ఆయన భూమిపూజ చేయించి మాట్లాడారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇంటి లబ్ధి చేకూరేలా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. దశల వారీగా ఇళ్లు మంజూరవుతాయని చెప్పారు. ప్రభుత్వం ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటోందని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల, ఇతర సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ నయీమ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిర్ర మల్లయ్య, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మెరుగు సంతోశ్, నాయకులు ఉల్లెంగుల యాదగిరి, చెవ్వ కాశీనాథం, నర్సింహుల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీ షర్టుల పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ధర్మ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బోడ రవి 17 మంది డప్పు కళాకారులకు శుక్రవారం టీ షర్టులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తన తండ్రి లచ్యా ఇటీవల మృతి చెందిన క్రమంలో ఆయన జ్ఞాపకార్థం కళాకారులకు టీ షర్టులు సమకూర్చినట్లు తెలిపారు. డప్పు కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యత ఇచ్చే దిశగా చొరవ తీసుకుంటానని చెప్పారు.

సనాతన హిందూ ధర్మ రక్షణే ధ్యేయం



వ్యవస్థాపకులకు నివాళులర్పించి మాట్లాడుతున్న శివరాములు

- బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు

నర్సంపేట : సనాతన హిందూ ధర్మ రక్షణే ధ్యేయంగా విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కార్యాచరణ సాగుతుందని బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్లు శివరాములు తెలిపారు. పట్టణంలోని డఫోడిల్స్ స్కూల్ ఆడిటోరియంలో పరిషత్ అధ్యక్షుడు చొల్లేటి జగదీశ్వర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పరిషత్ స్థాపక దివస్‌కు శివరాములు, చందర్ హాజరై మాట్లాడారు. 1964లో శ్రీ కృష్ణ జన్మాష్టమి నాడు పరిషత్ ఆవిర్భవించిందని చెప్పారు. హిందువులందరూ ఆలయాల రక్షణ, గోవధ నిర్మూలనకు పాటుపడాలని కోరారు. యువత బజరంగ్ దళ్ అనుబంధ దుర్గవాహిని వంటి విభాగాల్లో చేరి ధర్మ రక్షణలో భాగస్వాములై ఆదర్శవంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. తొలుత పరిషత్ వ్యవస్థాపకుల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ అంద్రు వనజ, కార్యదర్శి మల్యాల రవి, నర్సంపేట ప్రఖండ ఉపాధ్యక్షుడు డాక్టర్ అజ్మీర వీరన్న, కార్యదర్శి వేల్పుల శ్రీధర్, సహ కార్యదర్శి సిరిమల్ల నరేందర్, కోశాధికారి కలకోటి సుదర్శన్, సేవ ప్రముఖ్ దోనాల రవి, గోరక్ష ప్రముఖ్ గన్నోజు నాగార్జున, బజరంగ్ దళ్ కన్వీనర్ బూరుగు చరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన సీపీఎం సీనియర్ కార్యకర్త పుచ్చ వెంకటేశ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రూ.15 వేల సాయం అందజేశారు. వెంకటేశ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పుచ్చకాయల భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, పొన్నం రాజు, బొల్ల రమేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపులో నిర్లక్ష్యం సరికాదు

- ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు ఆనంద్

నర్సంపేట : వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు పింఛన్ పెంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు, జిల్లా ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆసరా పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చి ఎన్నికల్లో ఓట్లు దండుకుని గద్దెనెక్కి తదనంతరం సదరు హామీని విస్మరించిందని విమర్శించారు. వికలాంగులు, వితంతువులు, వృద్ధులు సమాజంలో ఇతరులతో పోల్చితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారికి ఇచ్చిన హామీని అధికారంలోకి రాగానే అమలు చేయాల్సిన ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఈనెల 12న నర్సంపేటలో నిర్వహించనున్న పెన్షనర్ల మహాసభలో ఉద్యమ కార్యాచరణకు రూపకల్పన చేస్తామన్నారు. సమావేశంలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల కృష్ణమూర్తి, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బాబు రాజు యాదవ్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్ దీప్, నాయకులు కొంగ మురళి, శ్రీను, నిరంజన్, గుడేటి వీరేశ్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దేవుని పూజల్లో ప్రముఖులు



సన్మానించుకుంటున్న ఎమ్మెల్సీ మల్లన్న, మాజీ మంత్రి ఎర్రబెల్లి

ఐనవోలు : మండలంలోని నందనం గ్రామంలో ఏటా పెద్దేవుని పూజల్లో భాగంగా సామూహిక వనభోజన కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు నిర్వహిస్తారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు శుక్రవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో పాటు పలువురు బీసీ సంఘం రాష్ట్ర నాయకులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రముఖులు కోరుకున్నారు. ఈక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఎదురెదురు పడడంతో చిరునవ్వుతో ఇరువురు పలుకరించుకుని ఒకరికొకరు శాలువాతో సన్మానించుకున్నారు.